క్లుప్తంగా

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

కొమరోలు: అన్నదాత సుఖీభవ జాబితాలో రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజశ్రీ తెలిపారు. అర్హులైన రైతులు ఆధార్ కార్డు తీసుకుని రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

రాచర్ల ఏపీఎం బదిలీ

రాచర్ల: మండల వెలుగు కార్యాయల ఏపీఎంగా కె.నరేష్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన పి.రమేష్ బాబు అర్ధవీడు మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గిద్దలూరు వెలుగు ఏపీఎం నరేష్‌ను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

అర్ధవీడు: మండల వెలుగు కార్యాలయ ఏపీఎం రామయ్య గౌడ్ దోర్నాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పి.రమేష్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన ఏపీఎంను వెలుగు సిబ్బంది సత్కరించారు.

మందుబాబులకు జైలు, జరిమానా

కొమరోలు: మండల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి గిద్దలూరు కోర్టు జరిమానాతోపాటు జైలు శిక్ష విధించినట్లుగా కొమరోలు ఎస్సై నాగరాజు శుక్రవారం తెలిపారు. ఐదుగురికి 10 వేల రూపాయల చొప్పున జరిమానా, నిందితుల్లో ఒకరికి 4 రోజుల జైలు, మరొకరికి 3 రోజులు, ఇద్దరికి 2 రోజులు, ఒకరికి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.భరత్‌చంద్ర తీర్పు వెల్లడించారని వివరించారు. నిందితుల్లో ఒకరి లైసెన్స్‌ను 6 నెలలపాటు సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు రూరల్: మండలంలోని కొండపేట, మోడంపల్లె, పాములపల్లెతో పాటు గిద్దలూరు పట్టణంలో విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ నారాయణరెడ్డి తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

14న రక్తదాన శిబిరం

గిద్దలూరు రూరల్: ప్రపంచ రక్తదానం దినోత్సవం సందర్భంగా పట్టణంలోని గణేష్ నగర్‌లో గల రమేష్ చిన్నపిల్లల వైద్యశాల ఆవరణలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మేమున్నాం సేవా సమితి నిర్వాహకుడు చల్లా అశోక్‌రెడ్డి తెలిపారు. రక్తదాన శిబిరంలో యువతతోపాటు ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు. రక్తదానం వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని, ప్రాణదాతగా నిలిచిపోతారని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తర్లుపాడు ఏఓ


జ్యోత్స్నాదేవి

తర్లుపాడు: మండల నూతన వ్యవసాయాధికారిగా పి.జ్యోత్స్నాదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కనిగిరి వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న ఆమె బదిలీపై తర్లుపాడులో నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ వెంకటేశ్వర్లు దర్శి టెక్నికల్ ఏఓగా బదిలీ అయ్యారు.

28న బేస్తవారిపేట విశ్రాంత ఉద్యోగుల ఎన్నిక

గిద్దలూరు రూరల్: ఈ నెల 28న బేస్తవారిపేట విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు ఆ సంఘ ఎన్నికల రాష్ట్ర కార్యదర్శి జి.రవీంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడితోపాటు ఇద్దరు సహాధ్యక్షులు, నలుగురు ఉపాధ్యక్షులు, ముగ్గురు సెక్రటరీలు, ఒక ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఒక కోశాధికారి పదవికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్ల స్వీకరించనున్నట్లు తెలిపారు.

సుఖీభవకు షరతులు.. అన్నదాతకు ని'బంధనాలు'!

- గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో 12,883 మంది రైతుల అనర్హత
- తహసీల్దార్ల లాగిన్‌లో పెండింగ్ ఉన్న రైతులు 17736 మంది
- కూటమి ప్రభుత్వ తీరుతో అన్నదాతల్లో గుబులు
- పథకం వర్తింపజేస్తారో, ఎగనామం పెడతారోనని ఆందోళన
- ఈకేవైసీ చేయకుంటే పథకం లేనట్లే..
- వైఎస్సార్ సీపీ హయాంలో పారదర్శకంగా 'రైతు భరోసా'



బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. రైతన్నలు సాగుకు సన్నద్ధం కావాల్సిన సమయమిది. కూటమి సర్కారు ఇస్తామన్న పెట్టుబడి సాయం గత ఏడాది నిలిపేయడం, ఏ ఏడాది షరతులు, నిబంధనలు పెడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది పూర్తిగా రైతులకు కాలం కలిసిరాలేదు. అతివృష్టి-అనావృష్టి, పంటలకు విపరీతంగా తెగుళ్లు రావడం, అకాల వర్షాలతో పంటలు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా చేతికందలేదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, దిగుబడి లేక రైతన్నలు రోడ్డెక్కిన సంఘటనలు కూటమి ప్రభుత్వంలో చోటుచేసుకుంటున్నాయి.

అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత తీరిగ్గా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ పథకం వర్తించాలంటే షరతులు వర్తిస్తాయంటూ మెలిక పెట్టింది. ఏ రైతుకు పథకం అందుతుందో ఏ రైతుకు వర్తించదో తుది జాబితాలో చూసుకోవాలని షాకిచ్చింది. ఎన్నికల సమయంలో పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా రూ.20 వేల పెట్టుబడి సాయం రైతులకు ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు, ఇప్పుడు పీఎం కిసాన్‌తో కలిపి ఇవ్వడానికి రంగం సిద్ధం చేశారు. ప్రభుత్వ నిబంధనలు నష్టం కలిగించేలా ఉన్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకానికి మంగళం పాడింది. ఒక్కో రైతుకు ఇస్తామన్నా రూ.20 వేలు ఇచ్చుంటే జిల్లా రైతాంగానికి రూ.572 కోట్లు లబ్ధి చేకూరేది. దీనిని విస్మరించిన కూటమి సర్కారు ఇప్పుడు లబ్ధిదారులను తగ్గించేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తోంది.

ఈకేవైసీ లేదంటే గోవిందా..!

అన్నదాత సుఖీభవ కింద లబ్ధి పొందే రైతుల సంఖ్యను మరింత తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. పెట్టుబడి సాయం పొందాలంటే ప్రతి రైతు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో బయోమెట్రిక్ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఈ-కేవైసీ చేయించుకుంటేనే రైతులకు సాయమందుతుందని స్పష్టం చేసింది. లేదంటే నగదు ఖాతాల్లో జమ చేసేది లేదని ప్రకటించింది.

గత ప్రభుత్వంలో పారదర్శకంగా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతుల భూముల వివరాలు కలిగిన వెబ్‌ల్యాండ్ వివరాలే ఆధారంగా ఐదేళ్లపాటు రైతు భరోసా పథకాన్ని దిగ్విజయంగా అమలు చేశారు. ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం అందించి అన్నదాతకు అండగా నిలిచారు. ఏ ఒక్క రైతుకు ఇబ్బంది కలుగలేదు. అధికారుల పరిశీలన, నివేదికలంటూ హడావుడి ఎక్కడా కనిపించేది కాదు. ఒక్క రైతు కూడా ఈ పథకం అందలేదన్న ఫిర్యాదు లేకుండా పథకాన్ని కొనసాగించారు. కేంద్ర వాటా రూ.6,000, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.7,500 కలిపి రూ.13,500ను గత వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిబంధనల పేరుతో లబ్ధిదారుల జాబితాలో కోతలు విధించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అర్హులు, అనర్హుల జాబితా ఇలా..

మార్కాపురం నియోజకవర్గం

మండలం	మొత్తం రైతులు	ఆమోదం పొందినది	తిరస్కరణకు గురైంది	తహసీల్దార్ పెండింగ్
మార్కాపురం	18,198	14,722	2,868	608
పొదిలి	17,529	14,799	1,715	1,015
తర్లుపాడు	11,805	10,459	863	483
కేకే మిట్ల	18006	14,232	1594	2,180
మొత్తం	65538	54,212	7040	4,286

గిద్దలూరు నియోజకవర్గం

మండలం	మొత్తం రైతులు	ఆమోదం పొందినది	తిరస్కరణకు గురైంది	తహసీల్దార్ పెండింగ్
కంభం	12,372	10,658	1406	308
బీవీ పేట	14,688	11,785	606	2,297
కొమరోలు	12,446	8,775	891	2,780
గిద్దలూరు	16,516	11,750	1,421	3,315
అర్ధవీడు	11,288	8,629	757	1,902
రాచర్ల	11,043	7,433	762	2,848
మొత్తం	78353	59,060	5843	13,450

వైఎస్సార్ సీపీ మండల అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

కంభం మండలం:
వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ అధ్యక్షుడిగా అవ్వారి గురుమూర్తి, మహిళా విభాగానికి షేక్ జరినా, రైతు విభాగానికి పాప తిరుపతిరెడ్డి, బీసీ సెల్‌కు షేక్ అరీఫ్, ఎస్సీ సెల్‌కు నగిలి ప్రభాకరరావు, ఎస్టీ సెల్‌కు దేవరకొండ రాజు, మైనార్టీ సెల్ షేక్ ఇబ్రహీం, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు జె.సుందరరావు, స్టూడెంట్ వింగ్‌కు సయ్యద్ సాహిద్, పంచాయతీ రాజ్ వింగ్‌కు మహబూబ్ పీరా, ఆర్టీఐ వింగ్‌కు ఆనంద్, వలంటీర్స్ వింగ్‌కు సయ్యద్ షఫీ, వీవర్స్ వింగ్‌కు కైరంకొండ బాలరంగయ్య, వాణిజ్య విభాగానికి చలువాది రమేష్, వైఎస్సార్ టీయూసీకి సయ్యద్ కొత్తూరు, అంగన్‌వాడీ వింగ్‌కు షేక్ రజియా, కల్చరల్ వింగ్‌కు పచ్చవ నాగేశ్వరరావు, సోషల్ మీడియా వింగ్‌కు బొల్లు రాములు, దివ్యాంగుల విభాగానికి గడ్డె స్వరూపకుమార్, పబ్లిసిటీ వింగ్‌కు మనుమాచు రామిరెడ్డిని నియమించారు.

కొమరోలు మండలం:
యూత్ వింగ్ అధ్యక్షుడిగా రామాణపు పవన్‌క ళ్యాణ్, మహిళా విభాగానికి స్వర్ణ శ్రీలత, రైతు విభాగానికి చల్లా శివారెడ్డి, బీసీ సెల్ గోనె రంగనాయకులు, ఎస్సీ సెల్‌కు గుడిపాటి ప్రసాద్, ఎస్టీ సెల్‌కు పెద్దవీర పోలయ్య, మైనార్టీ సెల్‌కు షేక్ ఖాజావలి, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు స్వర్ణ ఆంజనేయులు, స్టూడెంట్ వింగ్‌కు ఆకవీటి రవి, పంచాయతీరాజ్ వింగ్‌కు ముత్తుముల జయరామిరెడ్డి, ఆర్టీఐ వింగ్‌కు పసుపు పేరన్న, వలంటీర్స్ వింగ్‌కు మేరిగ భారతి, వీవర్స్ వింగ్‌కు పోలేబోయిన చంద్రశేఖర్, వాణిజ్య విభాగానికి బళ్లాని సత్యనారాయణ, వైఎస్సార్ టీయూసీకి శీలం వినోద్‌కుమార్ రెడ్డి, అంగన్‌వాడీ వింగ్‌కు పీయోలు లత, కల్చరల్ వింగ్‌కు వైజా భాస్కర్‌రెడ్డి, సోషల్ మీడియా వింగ్‌కు మేకల అవినాష్, దివ్యాంగుల విభాగానికి అట్ల పెద్దిరెడ్డి, పబ్లిసిటీ వింగ్‌కు పేరుబోయిన ఆదినారాయణ నియమితులయ్యారు.

రాచర్ల మండలం:
యూత్ వింగ్ అధ్యక్షుడిగా ముత్తుముల రాజశేఖర రెడ్డి, మహిళా విభాగానికి బిజ్జం రామలక్ష్మమ్మ, రైతు విభాగానికి ఎం.బాలిరెడ్డి, బీసీ సెల్‌కు ఆర్.వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్‌కు పెరిక శ్రీను, ఎస్టీ సెల్‌కు పోసాని ఆంజనేయులు, మైనార్టీ సెల్‌కు షేక్ షరీఫ్ బాషా, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు చిట్టెం మార్క్, స్టూడెంట్ వింగ్‌కు పగిడి శ్రీనివాసశాంతి భూషణ రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్‌కు ముత్యాల మధు, ఆర్టీఐ వింగ్ గోతం నారాయణ, వలంటీర్స్ వింగ్‌కు రోడల రవికుమార్, వాణిజ్య విభాగానికి కె.గోపి, వైఎస్సార్ టీయూసీ ఊశాల నారాయణ, అంగన్‌వాడీ వింగ్‌కు భవనం ధనమ్మ, కల్చరల్ వింగ్ రాచర్ల సుబ్బారావు, సోషల్ మీడియా వింగ్‌కు అన్నపురెడ్డి పీరారెడ్డి, దివ్యాంగుల విభాగానికి ఈదుల పాండురంగారెడ్డి, పబ్లిసిటీ వింగ్‌కు నందిరెడ్డి భూపాల్‌రెడ్డిని నియమించారు.

వ్యవసాయాధికారులు బదిలీ


బేస్తవారిపేటలో ఏఓలను సన్మానిస్తున్న ఎరువుల దుకాణ డీలర్లు


అనుములపల్లెలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ మహబూబ్‌బాషా

బేస్తవారిపేట/రాచర్ల: బేస్తవారిపేట మండల వ్యవసాయాధికారి జక్కం మెర్సీ గిద్దలూరు టెక్నికల్ ఏఓగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రాచర్ల మండల ఏఓ అబ్దుల్ రఫీక్‌ను నియమించారు. బేస్తవారిపేట ఏఓ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాగా ఇరువురు ఏఓలను ఎరువులు, పురుగుమందుల దుకాణాల యజమానులు ఘనంగా సన్మానించారు.

రాచర్ల మండల వ్యవసాయాధికారిగా షేక్.మహబుబ్‌బాషా శుక్రవారం బాధ్యలను స్వీకరించారు. ఆయన గిద్దలూరు టెక్నికల్ ఏఓగా పనిచేస్తూ బదిలీలపై రాచర్ల నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం అనుములపల్లె రైతు సేవా కేంద్రంలో స్థానిక రైతులతో సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ జాబితాలోని రైతులు వీఏఏల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. అనుములపల్లె సర్పంచ్ రమేష్, వీఆర్వో వెంకటేశ్వర్లు, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, వీఏఏ రమణ తదితరులు పాల్గొన్నారు.


ప్రకాష్‌రావ్

కొనకనమిట్ల: మండల ఏఓగా కె.ప్రకాష్‌రావ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పీసీపల్లి మండల ఏఓగా పని చేస్తూ బదిలీపై కొనకనమిట్ల రాగా, ఇప్పటి వరకు ఇక్కడ ఏఓగా పనిచేసిన ప్రసన్నరంగలక్ష్మి మార్కాపురం ఏడీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. నూతన ఏఓను వీఏఏలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని ఉత్తమ ఫలితాలు సాధించిన 10వ తరగతి విద్యార్థులను శుక్రవారం హెచ్‌ఎం, ఎంఈఓ నాగభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. 593 మార్కులు సాధించిన మొరసా ఖుషీ అనే విద్యార్థికి షైనింగ్ స్టార్ అవార్డు, రూ.20 వేల నగదు అందజేశారు. పాఠశాలకు చెందిన షేక్.షబ్నం కౌసర్, షేక్.మిస్బాకౌసర్, షేక్.నీరకట్టు రియా ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకున్నారని, మరో ఆరుగురు విద్యార్థులు ఎస్‌ఎస్ఎంఎస్‌కు ఎంపికయ్యారని వివరించారు. ప్రతిభ చాటిన విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ బాలునాయక్, ఉపాధ్యాయులు శోభన్, అనిత, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర పోటీల్లో కావ్యశ్రీకి ప్రథమ స్థానం


కావ్యశ్రీని అభినందిస్తున్న కమిషనర్ నారాయణరెడ్డి

పొదిలి: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఒంగోలులో శుక్రవారం పలు రకాల పోటీలు నిర్వహించారు. వ్యాస రచన పోటీల్లో పొదిలి నగర పంచాయతీకి బద్దిగం కావ్యశ్రీ పాల్గొని ప్రథమ స్థానం పొందింది. ఈ సందర్భంగా ఆమెను నగర పంచాయతీ కమిషనర్ నారాయణరెడ్డి అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కావ్యశ్రీని అభినందించిన వారిలో ఎస్ఐవీటీ డైరెక్టర్ జక్కం రేణుకారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతిరావు తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై దాణా పంపిణీ

తాళ్లూరు: సబ్సిడీపై పాడి రైతులకు సమీకృత దాణా పంపిణీ చేసినట్లు పశు వైద్యాధికారి వి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మాధవరంలో శుక్రవారం పాడి రైతులకు దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 కిలోల దాణా సంచి ధర రూ.1110 ఉండగా 50 శాతం సబ్సిడీపై రూ.555 అందించినట్లు చెప్పారు. దాణాతో పశువుల ఆరోగ్యంతో పాటు అధిక పాల దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా విడతల వారీగా పంపిణీ చేస్తామన్నారు. సర్పంచ్ టి.రేణుక, ఏహెచ్‌ఏ ఆంజనేయులు పాల్గొన్నారు.


దాణా పంపిణీ చేస్తున్న పశువైద్య సిబ్బంది

హైస్కూళ్లకు నూతన హెచ్‌ఎంలు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో జెడ్పీ ఉన్నత పాఠశాలలకు నూతన ప్రధానోపాధ్యాయులను నియమించారు. గొట్లగట్టు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎంగా ఆదినారాయణ నియమితులయ్యారు. ఈయన ఇంకొల్లులో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన సుజాత చినారికట్ల జెడ్పీ హాస్కూల్ హెచ్‌ఎంగా బదిలీ అయ్యారు. కొనకనమిట్ల హెచ్‌ఎంగా ఉదయకుమార్ బాధ్యతలు చేపట్టారు. నూతన హెచ్‌ఎంలుగా నియమితులైన వారిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

రేగడపల్లిలో పోలేరమ్మకు పొంగళ్లు


ఆలయం వద్ద నైవేద్యాలతో భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని రేగడపల్లి గ్రామంలో ప్రజల ఇలవేల్పు ఏరువాక పోలేరమ్మతల్లికి శుక్రవారం సాయంత్రం పొంగళ్లు పెట్టి ఉత్సవం నిర్వహించారు. గ్రామ దేవతలు పోలేరమ్మతల్లికి, బొడ్డురాయికి, పోతురాజుస్వామికి నైవేద్యాలు సమర్పించారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడితో పండగ వాతావరణం ఏర్పడింది.

జగదాంబ అమ్మవారికి విశేష పూజలు

మార్కాపురం టౌన్: పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అర్చకుడు వరుణ్‌తేజ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు చేశారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకారంలో జగదాంబ అమ్మవారు

సాయిభిక్ష ప్రారంభం


సాయి భిక్షలో పాల్గొన్న భక్తులు, మహిళలు

మార్కాపురం టౌన్: గురుపౌర్ణమిని పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో గల సాయి బాబా మందిరంలో శుక్రవారం సాయి భిక్ష కార్యక్రమం ప్రారంభించారు. ఐదు రోజులపాటు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యదర్శి గోపాలుని హరిహరరావు తెలిపారు. సాయిభక్తులు, మహిళలు పాల్గొన్నారని ఆలయ కమిటీ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ కోరారు. కోశాధికారి నాగరాజు, కమిటీ సభ్యులు, సుమారు 100 మంది మహిళా భక్తులు పాల్గొన్నారు.